క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మూల పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ కరుణించూ అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండి వంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుంచి శ్రీనివాససెంటర్ వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎర్రిస్వామి మాట్లాడుతూ భగత్ సింగ్ నేషనల్ గ్యారెంటీ ఎంప్లాయీ మెంట్ యాక్టును అమలు చేయాలని, మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా కాగడాల ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు శ్రీనివాసులు, స్వరూప్, శ్రీనివాస్, ప్రవీణ్, మహేష్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న నిలింజి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అఖిల భారత క్రీడా భారతి ట్రెజరర్ నిలింజి, రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సురేంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో దక్షిణ భారత స్థాయి క్రీడా భారతి జిల్లాల క్రీడా నాయకుల సమావేశం క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, క్రీడా భారతి జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన జరిగింది. 2024–25 సంవత్సరంలో క్రీడా కార్యక్రమాల గురించి సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆవోపా ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న కాత్యాయని మెడికల్ షాపు ఆవరణలో కోవెలకుంట్ల కో ఆపరేటివ్ బ్యాంక్ సహకారంతో ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. బ్యాంకు సీఈఓ కృష్ణమూర్తి వాటిని ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బాటసారుల దాహం తీర్చేందుకు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు మధుసూదన్, గౌరవాధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, ట్రెజరర్ సురేష్, సభ్యులు, మేనేజర్లు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు

నంద్యాల (వ్యవసాయం): జిల్లాలో బీజేపీ పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషిచేద్దామని రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్జీ, జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. స్థానిక జయంతా వెజ్ వరల్డ్‌లో జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ జిల్లా సంస్థాగత జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని 36 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పార్టీ నిర్మాణం, బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు బీవీ సుబ్బారెడ్డి, ఎస్వీ రమణ, స్వామిరెడ్డి, ఉపేంద్రరెడ్డి, కొట్టె కృష్ణమూర్తి, ఇంటి ఆదినారాయణ, నిమ్మకాయల సుధాకర్, షబానా, చల్లా దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తీరని నష్టం



గోస్పాడు సమీపంలో తడిసిన మిరపను ఆరబెడుతున్న కూలీలు



శ్రీనివాసపురంలో నేలకొరిగిన వరిపైరును చూపుతున్న రైతులు



గోస్పాడు వద్ద ఈదురుగాలులకు ఎగిరిపోయిన మిరపకాయలు

అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిలించాయి. కోలుకోలేని దెబ్బతీశాయి. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజవర్గాల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీనికి ఈదురు గాలులు కూడా తోడయ్యాయి. దీంతో చేతికొచ్చిన వరి పైరు నేలకొరగగా, కల్లాలో ఆరబోసిన మిరప దిగుబడి తడిసిముద్దయింది. గాలుల తీవ్రతకు మామిడి నేల రాలిపోయింది. కోత దశలో ఉన్న వేరుశనగ, మొక్కజొన్న పంటలు సైతం దెబ్బతిన్నాయి. దొర్నిపాడు, గోస్పాడు మండలాల్లో వందలాది ఎకరాల్లో మిరప, వరి పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. –దొర్నిపాడు/గోస్పాడు



దొర్నిపాడు సమీపంలో గాలివానలకు నేలరాలిన మిరపకాయలు



దొర్నిపాడు మండలం గుండుపాపలలో తడిసిన మిర్చి దిగుబడులు

జిల్లా వీఎస్ఏపీ అధ్యక్షుడిగా శివరామకృష్ణ



ఎన్నికైన పత్రాలను చూపుతున్న అసోసియేషన్ నాయకులు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా విలేజ్ సర్వేయర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివరామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని నిశాంత్ భవన్‌లో ఆదివారం ఆ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా స్టేట్ కో ఆర్డినేటర్ ఓంకార్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడితో పాటు స్టేట్ కో ఆర్డినేటర్లను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివరామకృష్ణారెడ్డి మహబూబ్ మియాలు పోటీ పడగా శివరామకృష్ణారెడ్డి 5 ఓట్ల తేడాతో గెలుపొందారు. స్టేట్ కో ఆర్డినేటర్లుగా విజయభాస్కరరెడ్డి, మంజునాథ్ పోటీ పడగా విజయభాస్కరరెడ్డి 22 ఓట్ల తేడాతో గెలిచారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్ మన్నాన్, సెక్రటరీగా మస్తాన్‌వలి, జాయింట్ సెక్రటరీగా మహబూబ్‌బాషా, ట్రెజరర్‌గా జలీల్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శివరామకృష్ణారెడ్డి, విజయభాస్కరరెడ్డిని కార్యవర్గం శాలువాలతో సత్కరించింది.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



కుట్టుమిషన్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని లయన్స్ గవర్నర్ మాగం గౌతమ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో నిర్వహించిన భారీ సేవా కార్యక్రమంలో ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్ సభ్యులు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి నాగ మహేష్, కూర ప్రసాద్, అరవేటి రాఘవేంద్ర సహకారంతో పేద మహిళకు ఉపాధి కోసం తోపుడు బండి, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లగిశెట్టి విజయ్‌కుమార్ శెట్టి, అప్పారావు, గురురాజా స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి, డాక్టర్ నెరవాటి వినోద్ కుమార సహకారంతో 15 మోటార్‌తో పనిచేసే కుట్టు మిషన్లు, దివ్యాంగులకు 5 చక్రాల కుర్చీలు, ఆరుగురు బధిరులకు వినికిడి యంత్రాలు, 22 మంది పేద విద్యార్థులకు రూ.2 వేల ఉపకార వేతనాలు అందజేశారు. వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 10 మంది దివ్యాంగులకు నెలవారి మందులు అందజేశారు. స్థానిక స్నేహ వృద్ధాశ్రమానికి 100 కేజీల కంది బేడలు అందజేశారు. జీవనజ్యోతి అంధుల పాఠశాలలో ఉన్న 25 మంది అంధ విద్యార్థులకు కాస్మోటిక్స్ కిట్లు, 50 కేజీల బియ్యం అందించారు. 40 మంది దివ్యాంగ కుటుంబాలకు ఉగాది, రంజాన్ సరుకుల కిట్లను అందించారు. కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ ఏవీఆర్ ప్రసాద్, సుధాకర్ రెడ్డి, విక్రమ్, కిరణ్, ఎంపీ రమణయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు, వివిధ సేవా కార్యక్రమాలకు సహకరించిన దాతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ సీనియర్ నాయకులు సలాముల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ప్రజలను చైతన్యం చేసేందుకు వీసీ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక, కర్షక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించడమేకాక ప్రజల మధ్య మత చిచ్చు పెడుతోందన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ యువతను నిరుద్యోగులుగా మారుస్తుందన్నారు. మహిళలు, బాలికలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా చర్యలు శూన్యమన్నారు. ఈ నేపథ్యంలో మోడీకు హటావో.. దేశ్‌కు బచావో అనే నినాదంతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, శ్రీనివాసులు, హరినాథ్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



హైకోర్టు జడ్జిని కలిసిన నంద్యాల న్యాయవాదులు

నంద్యాల (వ్యవసాయం): కర్నూలు నుంచి విజయవాడకు వెళుతున్న హైకోర్టు జడ్జి హరిహరనాథ శర్మను ఆదివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బార్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా హైకోర్టు జడ్జికి బార్ అసోసియేషన్ నాయకులు స్వాగతం పలికి బొకే అందజేశారు. అనంతరం న్యాయవాదుల సమస్యలను హైకోర్ట్ జడ్జి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జయకృష్ణ, రామచంద్రారావు, వెంకటేశ్వర్లు, కృష్ణ, లింగయ్య, వెంకటేశ్వరరెడ్డి, రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు



ఆళ్లగడ్డలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లకు నివాళులర్పిస్తున్న దృశ్యం



సీపీఎం కార్యాలయంలో ..

నంద్యాల(న్యూటౌన్): సామ్రాజ్య వాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు అన్నారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో ప్రజల పక్షాన పోరాటం చేసి మూడు సంవత్సరాలకే ప్రాణాలు కోల్పోయిన గొప్ప స్వాతంత్య్ర సమర యోధుడు భగత్‌సింగ్ అన్నారు. ప్రజల బానిస విముక్తికి పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు తోటమద్దులు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, వెంకటలింగం, గౌస్, బాలవెంకట్, శివ, తదితరులు పాల్గొన్నారు.

➤ పట్టణంలోని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణకై ఉద్యమించాలని పేర్కొన్నారు.

➤ పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర మాజీ నాయకులు శ్రీనివాసులు అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నంద్యాల పట్టణ కార్యదర్శి విష్ణు, మాజీ కార్యదర్శి సూర్యప్రతాప్ మాట్లాడుతూ భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ యాక్టు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యార్థి యువజన నాయకులు రాజీలేని పోరాటాలు చేయాలన్నారు.

➤ పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆళ్లగడ్డ : నవతరానికి మార్గదర్శులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. అమరవీరుల బలిదానం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళి అర్పించారు. భారత స్వాతంత్య్రం కోసం వారు చేసిన ప్రాణత్యాగం నేటితరం యువతకు ఆదర్శమన్నారు. యువత వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహం అధికారి సురేష్, హెచ్‌ఎం రామకృష్ణ తదితరులు ఉన్నారు

నంద్యాల(వ్యవసాయం): భగత్‌సింగ్ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, రామచంద్రమూర్తి, రమేష్‌బాబు, శివరామిరెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

గోస్పాడు: వివిధ పంటలు సాగు చేసిన రైతులు ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వప్నికారెడ్డి సూచించారు. వరిలో వర్షం ఎక్కువైతే, పొలాల్లో నీరు నిలబడకుండా బయటికి పంపాలన్నారు. వీలైనంత వరకు ఇప్పుడు పైపాటి ఎరువులు వేసుకోకూడదని, అవసరం అయితే వర్షం తగ్గిన తర్వాత పైపాటి ఎరువులు వేసుకోవాలన్నారు. వేరుశనగ పంట కోతలు పూర్తి అయి ఉంటే వేరుశనగ కాయలు, మిరప తడవకుండా టార్పాలిన్లతో కప్పి ఉంచుకోవాలి. ఒకవేళ కోతకు సిద్ధంగా ఉంటే వర్షం తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తం

వ్యక్తి ఆత్మహత్య

రుద్రవరం: మండల పరిధిలోని చిలుకలూరుకు చెందిన వుశేన్‌వలి (46)అనే వ్యక్తి ఆదివారం విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ ఆరోగ్య పరిస్థితుల కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు రుద్రవరం పోలీసులు తెలిపారు.

31న బండ లాగుడు పోటీలు

రుద్రవరం: మండల పరిధిలోని శ్రీరంగాపురం పోలేరమ్మ తిరుణాల సందర్భంగా ఈనెల 31న వృషభ రాజములకు బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈసారి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 2న మోటర్ సైకిల్ స్లో, ఇసుక సంచి ఎత్తడం, ట్రాక్టర్ రివర్స్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. పోటీలు కమిటీ నిర్ణయం మేరకే జరుగుతాయని గెలుపొందినవారికి నిర్ణయించిన ప్రకారం నగదు బహుమతులు అందజేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉయ్యాలవాడ : మండల పరిధిలోని ఇంజేడు గ్రామంలో పేకాటాడుతున్న ఏడుగురిని ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఆ వ్యక్తులు ముళ్ల పొదల్లో పేకాటాడుతుండగా వారిని అదుపులోకి తీసుకుని రూ. 26,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

అవగాహనతోనే నివారణ

- క్షయకు క్రమం తప్పకుండా మందులు వాడటం ముఖ్యం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకు ముప్పు
- ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు
- జగన్ హయాంలోనే ఆర్థిక సాయం రూ.1000 కి పెంపు
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

గోస్పాడు : క్షయ చాపకింద నీరులా విస్తరిస్తుంది. రోగి తుమ్మినా, దగ్గినా, నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ వ్యాధి పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణం మీదకు వస్తుంది.దీర్ఘకాలిక రోగలలో ప్రధానమైనది క్షయ. ఈవ్యాధిపై అవగాహన పెంచుకొని, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాథమిక దశలోనే నివారణ చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఎడతెరిపినివ్వని దగ్గు, ఆకలి మందగించడం, ఛాతినొప్పి, విపరీతమైన అలసట ఇవన్నీ క్షయ(టీబీ) లక్షణాలే. ఈ వ్యాధి బారిన పడిన వారు వైద్యుల సూచనలు పాటిస్తూ అందజేస్తున్న మందులు క్రమం తప్పకుండా వినియోగిస్తే వ్యాధి నుంచి సులువుగానే బయటపడవచ్చు. అయితే చాలామంది మందులు సగం మధ్య లోనే మానేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.నేడు వరల్డ్ టీబీ డే (ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన దినం) సందర్భంగా ప్రత్యేక కథనం.



క్షయ నివారణపై పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు (ఫైల్)



తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

క్షయ వ్యాధి రాకుండా ఉండాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా ధూమపానం, మద్యపానం, సురక్షితం కాని లైంగిక సంబంధాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే మందులను పూర్తికాలం పాటు వాడాలి. పుట్టిన బిడ్డకు వెంటనే బీసీజీ టీకా వేయించాలి. దగ్గు వచ్చినప్పుడు నోటికి అడ్డుగా ఏదైనా పెట్టుకోవాలి. సాధారణ క్షయ వ్యాధికి ఆరు నెలల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ వ్యాధి చికిత్సకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. వారికి డాట్ ప్రొవైడర్ల ద్వారా 6 నుంచి 8 నెలల పాటు మందులు అందజేస్తున్నారు. వ్యాధి వచ్చిన తర్వాత వైద్యులు సూచించిన విధంగా నిర్ణీత సమయం మందులు వాడకపోతే అది మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా మారుతుంది. దీనికి రెండేళ్ల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. ఈ మందులను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నారు.

క్షయ కారణాలివే..

క్షయ అంటు వ్యాధి. ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అయితే మెదడు, ఎముకలు, మూత్రపిండాలు, పేగులు, చర్మం తదితర అవయవాలు ప్రభావితమై ప్రాణాంతకంగా నిలుస్తోంది. ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యవస్థ దెబ్బ తినడంతో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వం ఉచితంగా అందించే మందులు వాడి పోషక విలువతో కూడిన ఆహారం తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడవచ్చని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, కిడ్నీ, హెచ్ఐవీ–ఎయిడ్స్ బాధితులు, పోషకాహారం లోపంతో ఉన్నవారు, సిలికోసిస్ వ్యాధి కలిగి ఉన్న వారు, ఆర్థరైటీస్, సోరియాసిస్ బాధితులు ఎక్కువగా ఈ వ్యాధికి గురయ్యే అవకాశముంది. క్షయరోగులు ఎక్కువ గాలి, వెలుతురు ఉన్న చోట ఉండాలి. రోగికి వీలైనంత ఎక్కువ దూరంలో ఉండటం శ్రేయస్కరం. నిత్యం మాస్క్ వాడేలా చూడాలి. పుట్టిన బిడ్డకు 21 రోజుల్లోగా టీబీ టీకా వేయించాలి.

జిల్లాలో టీబీ పరీక్షల వివరాలు...

సంవత్సరం	పరీక్షలు	బాధితులు
2022	29.346	3467
2023	39.345	3588
2024	56.528	2473
2025(ఇప్పటివరకు)	11.778	528

వ్యాధినిర్ధారణ ఇలా !

రెండు వారాలకు మించి దగ్గ, సాయంత్రం వేళల్లో జ్వరం, దగ్గితే గళ్ల పడటం, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలుంటే క్షయగా అనుమానించి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలి. రోగి గళ్లను వైద్య సిబ్బంది సేకరించి మైక్రోస్కోప్, ట్రూనాట్, సీబీ నాట్ మిషన్ల ద్వారా నిర్ధారిస్తారు.

జగన్ ప్రభుత్వంలో రూ. వెయ్యికి పెంపు

ఉచితంగా మందులతో పాటు పెరిగినధరలకు అనుగుణంగా రోగి పోషకాహారం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్థికసాయం రూ.వెయ్యి కి పెంచింది.గతంలో ప్రతి నెలా రూ.500 చొప్పున అందజేస్తుండగా రెండింతలు పెంచింది.

మందులను వాడటంతో పాటు బలవర్ధకమైన ఆహారం తీసుకోవటం వల్ల క్షయను అదుపులోకి తీసుకురావచ్చన్న ఆలోచనతో జగన్ ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకొని బాధితులను ఆదుకుంది. క్షయ ఉన్న 3,261 మంది బ్యాంకు ఖాతాలు సేకరించి వారికి ప్రతి నెలా రూ.1000 చొప్పున ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1,22,57,000ను డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్ కింద జమ చేశారు. అలాగే జిల్లాలో 3.14 లక్షల మంది అర్హతగల లబ్ధిదారులకు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అందజేశారు.

క్షయను అశ్రద్ధ చేయరాదు..



రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు ఉంటే అలాంటి వారు వెంటనే సంబంధిత ఆసుపత్రులలో పరీక్షలు చేయించుకోవాలి. అలాంటి సమయాల్లో జబ్బు ఉన్నట్లు నిర్ధారణ అయితే వారికి వెంటనే మందులను ఉచితంగా అందిస్తున్నాం. జిల్లాలో క్షయ వ్యాధిని అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. రోగులు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలి. చాలా మంది పూర్తి కోర్సు వాడటం లేదు. కొన్నాళ్లు వాడి మానేస్తున్నారు. ఇటువంటి వారి వల్లే వ్యాధి వ్యాపిస్తుంది. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి బయట పడవచ్చు. ఇందుకోస వారి బ్యాంకు ఖాతాలలో నెలనెలా రూ. వెయ్యి చొప్పున జమఅవుతుంది.

–డాక్టర్ శారద బాయి, జిల్లా క్షయ నివారణ అధికారి, నంద్యాల